# బీఆర్‌ఎస్‌ది 'మాఫీ' పాలన

- ఎన్నో రకాల పన్నులు మాఫీ చేసిన ఘనత కేసీఆర్‌ది
- కేటీఆర్‌పై కాంగ్రెస్ నేత కేకే విమర్శలు మూర్ఖత్వం
- మరోసారి పునరావృతమైతే తగిన గుణపాఠం చెబుతం
- బీఆర్‌ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య
- మహిళలను విమర్శించడం సంస్కృతి కాదు
- జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ




మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 12: గత ప్రభుత్వాలు మోపిన వివిధ రకాల శిస్తు(పన్ను)ను మాఫీ చేసి సుభిక్షమైన పాలన అందించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్‌ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కొనియాడారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వరాష్ట్రంలో కేసీఆర్ విప్లవాత్మకమైన అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగించారని కొనియాడారు. ఆయన నాయకత్వంలో రైతులు, కార్మికులు, బడుగు, బలహీన, అన్ని వర్గాల ప్రజలందరూ సంతోషకరమైన జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ పాలన దేశానికే మార్గదర్శకంగా నిలిచిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిన పథకాలపై బురదజల్లే విధంగా కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడడాన్ని ఖండిస్తున్నామన్నారు. భూమి శిస్తును రద్దు చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. గీతకార్మికుల సంక్షేమాన్ని కోరుతూ తాటి, ఈత చెట్లపై పన్నులు మాఫీ చేశారని, ఆటో డ్రైవర్ల టాక్సీని ఎత్తివేశారని గుర్తుచేశారు. మత్స్యకారుల సొసైటీల పన్నులు రద్దు చేసి ఉచితంగా చేప పిల్లలను అందించారన్నారు. నేతన్నలకు యారన్ సబ్సిడీ ఇవ్వడంతో పాటు ఉపాధి మార్గాన్ని మెరుగుపరిచారన్నారు. పచ్చ కామెర్లు వచ్చిన వ్యక్తికి లోకమంతా పచ్చగా కనిపించిన విధంగా కేకే మహేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌పై విమర్శలు చేస్తున్నాడని ఆరోపించారు. సిరిసిల్లలో నాలుగు రోడ్లు, నాలుగు డివైడర్లు మాత్రమే పనులు జరిగాయని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సిరిసిల్ల మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేటీఆర్‌దే అన్నారు. ప్రతి గ్రామంలో హరితహారం ద్వారా పచ్చలహారంగా మార్పు చేశారన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించామన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా అభివృద్ధిలో కేటీఆర్ మార్క్ కనిపిస్తుందన్నారు. కేకే మహేందర్‌రెడ్డి చేసిన విమర్శలు నిజమైతే ప్రజలు ఆయన్ను ఏనాడో నమ్మి, అక్కున చేర్చుకునేవారన్నారు. ప్రజలు ఎన్నిసార్లు తిరస్కరించినా కేకే మహేందర్‌రెడ్డి మనసు మారకపోవడం బాధాకరమన్నారు. ప్రజలు ఆశీర్వదించిన నాయకుడిని విమర్శిస్తే ప్రజలు సహించబోరన్నారు. ప్రజల ఆలోచనలను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఇష్టానుసారంగా మాట్లాడితే ఖబడ్దార్ అని హెచ్చరించారు. ప్రజల అవసరాలు గుర్తించి వారికి అందుబాటులో ఉండి పనిచేస్తామన్నారు.

**మహిళలను అవమానపరచడం సరికాదు: జడ్పీ చైర్‌పర్సన్ అరుణ**

గంభీరావుపేటలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి మహిళలను అవమానపరిచేలా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళలను గౌరవించుకునేది తెలంగాణ సంస్కృతి అని చెప్పారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలు ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన నేత కేసీఆర్ అని కొనియాడారు. రైతాంగానికి పెద్దపీట వేసి వ్యవసాయాన్ని పండుగ చేశారని, నేతన్నకు ఉపాధి కల్పించి వారికి అండగా నిలిచారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించడంతోపాటు రాష్ట్రంలో నిరంతర విద్యుత్‌ను అందించారన్నారు. ఆరు గ్యారెంటీల ద్వారా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్నింటినీ విజయవంతంగా అమలుచేయాలని సూచించారు. సమావేశంలో టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు దార్నం లక్ష్మీనారాయణ, కుంబాల మల్లారెడ్డి ఉన్నారు.

## రాజన్న హుండీ ఆదాయం రూ.1.99కోట్లు

- 20 రోజుల్లో రికార్డు స్థాయిలో ఆదాయం



హుండీ లెక్కింపులో రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు

వేములవాడ టౌన్, డిసెంబర్ 12: వేములవాడ రాజన్న ఆలయ హుండీ ఆదాయం రూ.కోటీ99లక్షల 38 వేల 997 సమకూరినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ వెల్లడించారు. మంగళవారం రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై నిర్వహించిన లెక్కింపులో పై మొత్తంతో పాటు 203 గ్రాముల 500 మిల్లీగ్రాముల బంగారం, 10 కిలోల 100 గ్రాముల వెండి సమకూరినట్లు చెప్పారు. ఈ ఆదాయం కేవలం 20 రోజులది మాత్రమేనని వెల్లడించారు. లెక్కింపులో ఆలయ ఏఈవోలు, పర్యవేక్షకులు, ఆలయ ఇన్‌స్పెక్టర్స్, సిబ్బంది, శివరామకృష్ణ భజనమండలి సభ్యుల ఆధ్వర్యంలో 400 మంది భక్తులు పాల్గొన్నారు.

## దవాఖానకు వచ్చి వెళ్తూ.. మృత్యు ఒడికి

- ధర్మపురి కూరగాయల మార్కెట్‌లో కుప్పకూలిన వృద్ధుడు
- అక్కడికక్కడే మృతి

ధర్మపురి, డిసెంబర్12 : దవాఖానకు వచ్చి వెళ్తూ ఓ వృద్ధుడు మృత్యు ఒడికి చేరాడు. తిరుగు ప్రయాణంలో కూరగాయలు కొనేందుకు వెళ్లి అక్కడికక్కడే కుప్ప కూలిపోయాడు. ధర్మపురి పోలీసుల వివరాల ప్రకారం.. ధర్మపురి మండలం రాజారం గ్రామానికి చెందిన బగ్గి పోషన్న(72)కు ఏడాది క్రితం గుండెపోటు వచ్చింది. అప్పటినుంచి మందులు వాడుతున్నాడు. కొద్దిరోజుల నుంచి చేయి నొప్పి రావడంతో మంగళవారం ధర్మపురిలోని ఓ ప్రైవేటు దవాఖానకు వెళ్లాడు. అక్కడ డాక్టర్ పరీక్షించి టెస్టులు రాశాడు. తన దగ్గ ర డబ్బులు లేవని, బుధవారం వచ్చి చేయించుకుంటానని దవాఖానలో చెప్పి ఆ వృద్ధుడు తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలోనే సమీపంలో ఉన్న సమీకృత మార్కెట్‌లో కూరగాయలు కొనేందుకు నడుచుకుంటూ వెళ్లాడు. ఆయాసం రావడంతో మార్కెట్లో మెట్లపై కాసేపు కూర్చున్నాడు. అంతలోనే కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు 108తోపాటు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడకు చేరుకున్నారు. అప్పటికే మృతి చెందినట్టు గుర్తించారు. వృద్ధుడి వద్ద లభించిన ఆధారాలతో పోషన్న భార్య ఇందవ్వ సమాచారం అందించారు. ఆమె అక్కడకు వచ్చి మృతదేహంపై పడి బోరుమన్నది. దవాఖానకు వెళ్లొస్తానని చెప్పి కానరానిలోకాలకు పోయాడంటూ కన్నీరుమున్నీరుగా విలపించింది. పోషన్నకు ఒక కొడుకు, కూతురు ఉండగా, ఇద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. కొడుకు ఉపాధి కోసం సింగపూర్ వెళ్లాడు.

## ప్రాణంమీదికి తెచ్చిన జామకాయలు

- ఠాణాలో జామకాయలు తెంపేందుకు రెస్ట్ రూం ఎక్కిన మహిళా హోంగార్డు
- విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కొట్టడంతో తీవ్రగాయాలు
- మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలింపు

జగిత్యాల రూరల్, డిసెంబర్ 12: జామకాయలు కోసేందుకని ప్రయత్నించిన ఓ మహిళా హోంగార్డు విద్యుదాఘాతంతో ప్రాణాలమీదికి తెచ్చుకున్న ఘటన జగిత్యాలలో జరిగింది. సీఐ ఆరీఫ్‌అలీఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో తొగిటి రాధ హోం గార్డుగా పనిచేస్తున్నది. ఠాణా ఆవరణలో జామచెట్టుకు జామకాయలు తెంపడానికి ప్రయత్నించింది. కాయలు అందకపోవడంతో పక్కనే ఉన్న రెస్ట్ రూం పైకి ఎక్కి అల్యూమినియం పట్టీ సాయంతో జామకాయలు తెంపుతుంది. ఈ క్రమంలో రెస్ట్ రూం పైన ఉన్న విద్యుత్ వైర్లను హోం గార్డు గమనించలేదు. ఈ క్రమంలో అల్యూమినియం పట్టీ పై ఉన్న విద్యుత్ వైర్లకు తగలడం, రాధకు విద్యుత్ షాక్ తగలడంతో అక్కడే పడిపోయింది. గమనించిన జగిత్యాల రూరల్ ఎస్ఐ సదాకర్, పోలీసులు గాయపడ్డ రాధను హుటాహుటిన పోలీస్ వాహనంలో జగిత్యాల జిల్లా దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచనమేరకు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ అపోలో దవాఖానకు తీసుకెళ్లారు. విద్యుత్ ప్రమాదం జరిగిన స్థలాన్ని జగిత్యాల అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి, జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్‌అలీఖాన్ పరిశీలించారు. అంతకుముందు జగిత్యాల జిల్లా దవాఖానలో హోంగార్డు రాధను పరిశీలించి, అధైర్యపడవద్దని పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## మిగులు అసైన్డ్ భూములను నిరుపేదలకు పంపిణీ చేస్తాం

- ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- మండల స్థాయి అధికారులతో సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్

ధర్మారం, డిసెంబర్ 12: ధర్మారం మండలంలో ప్రభుత్వ అసైన్డ్ మిగులు భూములను అర్హులైన పేద ప్రజలందరికీ పంపిణీ చేసేందుకు తన వంతు కృషిచేస్తానని ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. మంగళవారం సాయంత్రం ధర్మారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో శాఖల వారీగా ఆయన సమీక్షించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నర్సింగాపూర్, ఖిలావనపర్తి, బొమ్మారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఉన్న అసైన్డ్ భూముల వివరాలతో కూడిన నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ రజితను ఆదేశించారు. 2018 నుంచి ఇప్పటివరకు డీఎంఎఫ్‌టీ నిధుల మంజూరు వివరాలు, గ్రామాల వారీగా చేపట్టిన పనుల వివరాల సమ గ్ర నివేదికను ఇవ్వాలని పీఆర్ ఏఈ రాజశేఖర్‌ను ఆదేశించారు. ఈ నెల 16 లేదా 17న ధర్మపురిలో నిర్వహించే సమీక్ష సమావేశానికి నివేదికలతో హాజరుకావాలని ఏఈకి సూచించారు. మంత్రి శ్రీధర్‌బాబు సాయంతో సింగరేణి అధికారులను కలిసి నియోజకవర్గానికి మరిన్ని డీఎంఎఫ్‌టీ నిధులు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. అలాగే వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ మండల శాఖ అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తాను రెండు రోజుల్లో పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తానని తెలిపారు. మిషన్ భగీరథ పథకానికి సంబంధించి ధర్మారం మండలంలో రూ.32 కోట్ల విలువైన పనులు జరిగాయని శాఖ ఏఈ అజీమొద్దీన్ వివరించగా, సమగ్ర నివేదికను ఇవ్వాలని సూచించారు. ధర్మారంలో సమీకృత వసతి గృహ భవన నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు తాను పాలకుడిగా కాదు ప్రజలకు సేవకుడిగా ఉంటానని స్పష్టం చేశారు. సమావేశానికి ఎంపీడీవో భీమ జయశీల సమన్వయ కర్తగా వ్యవహరించగా, తాసిల్దార్ అంబటి రజిత, పీఆర్ ఈఈ బీ గిరీష్ బాబు, డీఈఈ శంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తొలిసారి మండలానికి వచ్చిన లక్ష్మణ్ కుమార్‌ను అధికారులు సన్మానించారు.

## యువతితో భర్త రాసలీలలు?

- ఠాణాలో భార్య ఫిర్యాదు.. కేసు నమోదు
- తంగళ్లపల్లి మండలం మారుమూల గ్రామంలో ఘటన
- గ్రామ పెద్దల సమక్షంలో యువతితో రాజీ?

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 12 : తంగళ్లపల్లి మండలం మారుమూల గ్రామంలో కూతురు వయసున్న యువతితో ఓ ప్రబుద్ధుడు రాసలీలలు జరిపాడు. నీలి చిత్రాల మాదిరిగా జరిపిన రాసలీల వీడియోను భార్య గుర్తించి, ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన ఈ ప్రాంతంలో చర్చనీయాంశమైంది. వారం రోజుల క్రితం భార్యనే ఫిర్యాదు చేయడంతో సదరు ప్రబుద్ధుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, గ్రామ పెద్దలు రాజీ కుదర్చి, ప్రబుద్ధుడితో యువతి కాళ్లు మొక్కించినట్లు తెలిసింది. సదరు ప్రబుద్ధుడు రాసలీలలు జరిపి వీడియోలు తీయడంతో అవి కూడా పలువురి ఫోన్లలోకి చేరినట్లు సమాచారం. యువతితో రాజీ కుదిర్చినప్పటికీ సదరు ప్రబుద్ధుడి చేతిలో మరి కొంత మంది మహిళలతో సన్నిహితంగా ఉన్న వీడియోలు ఉన్నాయని ప్రచారం సాగుతోంది. కేసు నమోదు చేసిన పోలీసులు లోతుగా విచారణ చేస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని, మహిళల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రబుద్ధుడికి చట్టపరంగా శిక్షపడేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ధర్మారం, డిసెంబర్12: ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ బాలికల గురుకుల విద్యాలయంలో పలు పోస్టుల భర్తీకి గిరిజన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్, కరీంనగర్ ప్రాంతీయ సమన్వయ అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ టీచర్-1, ఏఎన్‌ఎం-1 పోస్టు ఖాళీ ఉందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 18లోగా హన్మకొండలోని గిరిజన సంక్షేమ శాఖ ప్రాంతీయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.